# ★ క్రీనీడలు ★

ఉన్నట్టుండి గాలి వీచేసరికి ఉలిక్కిపడ్డాడు భానుమూర్తి.

చేతుల్లోఉన్న మనోరమ ఫోటోతీసి బల్ల మీద పెట్టాడు.

ఉత్సాహంగా లేచి నుంచున్నాడు నిద్ర మత్తు పూర్తిగా వదల్లేదు. ఫ్లాస్కులోంచి టీ కప్పులోకి వంచుకున్నాడు. కిటికీలోగుండా బైటకు చూశాడు. చిక్కని చీకటి నోరు తెరచుకుంది.

టైం చూసుకున్నాడు. పదకుండూ ఐదు

తెరచి ఉన్న కిటికీగుండా చల్లటి గాలి వీస్తోంది.

ఆకాశానికీ, భూమికీ మధ్య వ్రేలాడుతూ మిణుకు మిణుకు మంటూన్నాయి నక్షత్రాలు.

హాస్టల్ బ్లాకు అంతా ఖాళీగా వుంది.
అందరకూ వేసంగి సెలవులు
తనకు కాదు.
రిసెర్చిలో సెలవులు వుండవు.

అవతల బ్లాక్‌లో చివరిగదిలో లైటు వెలుగుతూ వుంది. గదిలోంచి సన్నగా యీల పాట వినిపిస్తోంది.

పెట్టె తెరచి థీసీస్ బైటకు తీసాడు.
మూడు వందల పేజీలు.

ఫేర్ రాయాలి. టైప్ కీయాలి. వాళ్లు అంగీకరించాలి. మిస్టర్ భానుమూర్తి నుండి డాక్టర్ భానుమూర్తి అవుతాడు తను. మనసులో ఈ ఆలోచన రాగానే ఆనందంతో ఉప్పొంగిపోయాడు.

టేబిల్‌మీదున్న సిగిరెట్ వెలిగించాడు. బల్లమీద కూర్చున్నాడు. ఫేర్ చేయడం మొదలు పెట్టాడు. బల్లమీద మనోరమ ఫోటో నవ్వుతోంది.

మనోరమ నవ్వుమీద రీసెర్చి చేయాలి. అనుకున్నాడు నవ్వుకుంటూ.

మనోరమ యం. ఏ. అయిపోయింది. ఉద్యోగం చేయాలనిలేదు. అందమైన భర్తతో వెన్నెల్లో తాజమహల్ చూస్తూ కాలం గడపాలట. తనే ఆ అదృష్టవంతుడు ఎందుకు కాకూడదు ?

తెరచిఉన్న తలుపుగుండా గాలి ధారళంగా వీస్తోంది.

అవతల బ్లాకులో లైటు ఆరిపోయింది.
ఈలపాట సన్నబడింది.
దూరాన చర్చిలో గంటలువినిపిస్తున్నాయి!
గాఢ నిశబ్దం అలుముకుంది

పది పేజీలు వ్రాసేప్పటికి చేయి నొప్పి పుట్ట సాగింది వ్రాయడం ఆపి పెన్ను మూతపెట్టి, సిగరెట్ తీసి నోట్లో పెట్టుకున్నాడు.

రచన:
బి. పి. కరుణాకర్

సిగరెట్ వెలిగించబోయాడు.

నడవలో ఎవరో నడుస్తున్న శబ్దం వినిపించింది.

అగ్గిపుల్ల ఆరిపోయింది.

నడవలో చప్పుడు నిశబ్దంలో మునిగి పోయింది.

మరోపుల్ల వెలిగించి సిగరెట్ వెలిగించుకున్నాడు.

కుర్చీలోంచి లేవబోయాడు

లైటు ఆరిపోయింది

లేవబుద్ధి కాలేదు. సిగిరెట్ పీలుస్తూ అలానే కూర్చుండిపోయాడు.

నడవలో అడుగులు చప్పుడు వినిపించలేదు.

పెద్దగా గాలి వీచింది
కాయితాలన్నీ చిందరవందరయ్యాయి

గన్నేరుచెట్టుమీద గుడ్లగూబభయంకరంగా అరిచింది.

లేచి కాయితాలన్నీ సర్దాలనుకున్నాడు. లైటు కావాలి. కొద్దిసేపు ఆగితే కరంట్ వస్తుంది. తనదగ్గర కేండిల్ కూడా లేదు. అగ్గిపెట్టెలో మరో మూడుపుల్లలుంటాయి అంతే

తనీ హాస్టల్ చాల రాత్రుల్లు ఒంటరిగా గడిపాడు కానీ ఈనాటి వంటరితనంలో పిరికిదనం తనలో చోటు చేసుకుంటుంది.

దయ్యాలంటే తనకు నమ్మకంలేదు. భ్రమకు ప్రతిరూపం దయ్యాలు; పేరుకున్న భయం వివిధ ఆకృతులలో తీసుకోవచ్చు.

తలుపు పెద్ద శబ్దం చేసుకుంటూ మూసుకు పోయింది.

ఆలోచనల్లోంచి తేరుకున్నాడు భానుమూర్తి.

సిగిరెట్ చివరంటా కాలింది. కిటికీలోగుండా బైటకు విసిరాడు.

తలుపు ఎవరో తట్టినట్లనిపించింది.
భ్రమకావచ్చు. లేకపోతే గాలి కావచ్చు
కూర్చున్న కుర్చీలోంచి లేవలేదు.
నడవలో గాజులు గలగలమన్న చప్పుడు
మళ్ళీ విన్నాడు
భ్రమకాదు !
తిరిగి తలుపు తట్టిన శబ్దం
ఈసారీ అంతే !
కుర్చీలోంచి లేచాడు
"ఎవరూ ?" అన్నాడు
తలుపు దగ్గరకు నడిచాడు
హఠాత్తుగా తలుపు తెరిచాడు
ఎవరో పరుగెత్తిన ధ్వని
మెట్లమీద గాజుల చప్పుడు
ఆశ్చర్యపోయాడు
"ఏ కాన్ హై ?"
— పెద్దగా అరిచాడు
ఎవ్వరూ పలకలేదు
నిశ్శబ్దం.
దూరంగా కుక్క ఏడుస్తోంది

(తరువాయి 20 వ పేజి)

(౯ వ పేజీ తరువాయి)

ఎండిన ఆకులు గాలికి చప్పుడు చేస్తున్నాయి.

మెయిన్ గేట్ దగ్గర బ్యాటరీలైట్ వెలిగి ఆరిపోయింది.

తిరిగి గదిలోకి వచ్చాడు.

సిగరెట్ కొరకు వెతుక్కుంటూ గమనించాడు, తన చేతులు వొణుకుతున్నాయి. సిగరెట్ వెలిగించాడు. అగ్గిపుల్ల వెలుగులో గదంతా పరీక్షించాడు. థీసీస్ కాయితాలన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి

గదిమూలకు నడిచాడు, హాకీ బేట్ దొరికింది. అందుకున్నాడు.

'తనను భయపెట్టడానికి ఎవరేనా ఇలా చేస్తున్నారేమో' అనిపించింది.

నడవలో కుర్చీవేసుకుని కూర్చున్నాడు.

చాలా సేపు గడిచింది.

ఎవ్వరూ రాలేదు.

ఏ చప్పుడూ కాలేదు.

విసుగు పుట్టింది. కుర్చీలోంచి లేచాడు. నిద్ర ముంచుకు వస్తోంది.

గదిలో అలికిడైంది. హఠాత్తుగా తలుపు తెరిచాడు. కిటికీలోంచి ఓ ఆకారం బైటకు దాటిపోతోంది. హాకీ బేట్ విసిరాడు. కిటికీ ఊచకు తగిలి పెద్ద శబ్దమైంది. కిటికీ వైపుకు పరుగెత్తాడు.

'కౌన్ హైతూ' పెద్దగా కేకవేశాడు.

అక్కడి వాళ్ళకు తెలుగురాదు.

క్రిందకు చూశాడు.

ఆకారం చీకట్లో కలసిపోయింది.

గుండెల్లో పిరికిదనం చోటుచేసుకుంది.

సమయానికి కరంట్ పోయినందుకు విసుక్కున్నాడు.

క్యాంప్ కాట్ మీద కూలబడ్డాడు.

తలుపు తెరిచే వుంది.

మనసులో ఎన్నో ఆలోచనలు ముసురుకుంటున్నాయి. తెలియని కోపంతో పెదాలు వొణుకుతున్నాయి.

కొద్దిసేపయాక నడవలో ఎవరో నడచి వెళ్తున్న చప్పుడు వినిపించింది. చటుక్కున లేచి నుంచున్నాడు భానుమూర్తి. కోపం కట్టలు తెంచుకుంటుంది.

గాజులు గలగలమన్నాయి.

నడవలోకి నడిచాడు.

మసి పూసుకున్న చీకటి మత్తుగా పడుకుంది.

శబ్దం మెట్లమీద ఆగిపోయింది.

మెట్లవైపుగా పరుగెత్తాడు.

ఆగి, 'కౌన్ హై తూ' అన్నాడు.

ఓగొంతు వినబడింది.

'నేను' ఎప్పుడు ఆ గొంతు వినలేదు.

'ఏం కావాలి?' హిందీలోనే అడిగాడు భానుమూర్తి.

చీకట్లో ఎదుటివ్యక్తి కనిపించడంలేదు.

'ఏమీ వద్దు'

'మరి...'

'ఇలారండి'

రెండుమెట్లు క్రిందకు దిగాడు భానుమూర్తి

'ఎక్కడ?'

ఎవరూ పలకలేదు. మెట్లు క్రిందకు దిగాడు. ఎవరూలేరు. విసుగుతో వెనక్కు తిరిగాడు.

ఏం జరిగిందో గ్రహించేలోపల కళ్ళు తిరిగిపోసాగాయి. వీపు తడుముకున్నాడు. చేయంతా తడి అయింది. బాధతో కళ్లు మూసుకున్నాడు

తెల్లవారింది.

భానుమూర్తి యూనివర్సిటీ హాస్టల్ బి బ్లాక్ మెట్ల చివర నిర్జీవంగా పడిఉన్నాడు.

హాస్టల్ గోడ అవతల ఎవరో ఒక వ్యక్తి పడివున్నాడు. అతని జేబులో మనోరమ ఫోటో ఉంది. కొద్దిదూరంలో ఒక పాము పుట్ట ఉంది.

భానుమూర్తి గదిలో థీసీస్ పేపర్లన్నీ కాలిపోయి ఉన్నాయి. బల్లమీద ఫోటో స్టాండులో మనోరమ ఫోటో లేదు.

---

# సూక్తిసుధ

తమకు లాభ మదెంత మాత్రంబు లేక
యుండినను భారమనక చేయుచునె యుంద్రు
పరుల కుపకృతి మోయుగా భార మనక
భువి సులోచనముల ముక్కు-చెవులు మోయు.

ఋజుగతిని గన్న పూజ్యత క్షితిని గలుగు
కుటిలగతిఁ బొందుచోఁ గల్గుఁ గ్రూర శిక్ష
నూటియగు పాపటకు మంచిసొబగు పిండె,
కినుము కుటిలాలకలకు బంధనము గాదె

సుజన దుర్జనుఁ లిర్వురుఁ జూడుట కిల
నొక్కటిగ నున్న బలుకుల ఫక్కి వేఱు
కాకి, కోకిల కనుటకు నేకరీతి
నున్న కంఠస్వంబ విభిన్నము గద!

సుజనుఁ డొక్కప్డుఁ కఠినతఁ జూపి నంత
గ్రూరునిగ వానిఁ నెంచగాఁ గూడఁ దెపుడు
నారికేళంపు గట్టితనంబుఁజూచి
లోని సరసత ముఱువంగనౌనె చెపుమ!

లోకమునఁ గంటికింపుగా లేకయున్న
హృదయమది మంచిదైన సమ్మోదము గల్గు;
పైకి సంపెంగ సొరుకన్పట్టుకున్న
దాని తావులు మనకు స్తుత్యములు కావె?

— కుమారి అద్దేపల్లి విద్యావతి